విద్యార్థుల్లో నైపుణ్యతను పెంచేందుకు అవగాహన ఒప్పందం


ఎంఓయూ సంతకాల కార్యక్రమంలో ప్రొ. విజ్ఞులత, డాక్టర్ మనీష్‌గుప్తా తదితరులు

సుల్తాన్‌బజార్: తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయానికి ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కంపెనీ సెక్రటరీస్ ఆఫ్ ఇండియా (ఐసీఎస్ఐ) అకాడమిక్ కోలాబరేషన్స్ ఇనిషియేటీవ్ కింద మంగళవారం కోఠిలోని తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయం ప్రాంగణంలో అవగాహన ఒప్పందంపై (ఎంఓయూ) సంతకం చేశాయి. ఈ సందర్భంగా ఐసీఎస్ఐ అధ్యక్షుడు సీఎస్ మనీష్‌గుప్తా మాట్లాడుతూ..పరిపాలన అనేది పాలసీలు, విధానాలు, పోలిసింగ్ గురించి మాత్రమే కాకుండా కొత్త నాయకత్వ విధానం, భవిష్యత్తులో సుపరిపాలన అనేది శీఘ్ర నిర్ణయం సూత్రంపై ఆధారపడి ఉంటుంది కాబట్టి రెండు సంస్థల ప్రయత్నాలు కార్పొరేట్ గవర్నెన్స్‌లో గరిష్ఠ విలువ సృష్టిని నిర్ధారిస్తాయన్నారు. మహిళా విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ విజ్ఞులత మాట్లాడుతూ..ఈ ప్రయత్నం రెండు భాగస్వామ్య సంస్థల మధ్య సంబంధాన్ని పెంపొందించడంలో సహాయ పడడమే కాకుండా కొత్త అవకాశాలను కూడా సృష్టిస్తుందన్నారు. వృత్తి నైపుణ్యాన్ని పెంచే పరంగా సహకారం తెస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయం ప్రత్యేక అధికారిణి ప్రొఫెసర్ కె.సరస్వతమ్మ, కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ వరిజా రాణి, హెచ్ఓడీ ప్రొఫెసర్ కె.కృష్ణచైతన్య, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ నజియా సుల్తానా, డాక్టర్ భవాని, సెంట్రల్ కౌన్సిల్ సభ్యులు ప్రవీణ్ సోని, లలితాదేవి, హైదరాబాద్ చాప్టర్ చైర్‌పర్సన్ వి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

కార్పొరేషన్ పదవుల్లో కురుమలకు ప్రాధాన్యమివ్వాలి


సమావేశంలో మాట్లాడుతున్న బీర్ల ఐలయ్య

అఫ్జల్‌గంజ్: కోమురవెల్లి మల్లికార్జున స్వామి దేవస్థానం చైర్మన్‌గా కురుమలనే నియమించాలని ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేసినట్లు ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య తెలిపారు. అదే విధంగా షీప్ అండ్ గోట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌తో పాటు ఇతర చైర్మన్ స్థానాలల్లో కురుమలకు ప్రాధాన్యమివ్వాలని కోరారు. ఆలేరు నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికైన కురుమ కులానికి చెందిన బీర్ల ఐలయ్యను మంగళవారం ముస్లింజంగ్ పూల్ బ్రిడ్జి వద్ద ఉన్న రాష్ట్ర కురుమ సంఘం భవనంలో రాష్ట్ర కురుమ సంఘం అధ్యక్షుడు, ఎమ్మెల్సీ యెగ్గె మల్లేషం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జవహర్‌నగర్ కార్పొరేషన్ మేయర్ కావ్య, కురుమ సంఘం రాష్ట్ర, నగర నాయకులు బండారు నారాయణ, కొలుపుల నరసింహ, కట్ట మల్లేషం, కెజె కృష్ణమూర్తి, రెక్కాల కొండల్ రాజ్, ఎక్కాల కన్నా, నర్స వినోద్, చీర శ్రీకాంత్, కెంద్యాల శ్రీనివాస్, వస్పరి శంకర్, గొరిగె మల్లేష్, ఒగ్గు కుమార స్వామి, బెజిని శ్రీనివాస్, ఒగ్గు బీరప్ప, యాదయ్య, బాలమణి పాల్గొన్నారు.

సీఎం హామీతో ఉత్సాహంగా పని చేస్తాం


సీఎం రేవంత్‌రెడ్డితో పాతబస్తీ నాయకులు

చార్మినార్: ప్రజా సమస్యల పట్ల ఎప్పటికప్పుడు అలెర్ట్‌గా ఉండి ఆయా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించడంతో ఇక ముందు తామంతా ఉత్సాహంగా పని చేస్తామని పాతబస్తీ కాంటెస్టెడ్ ఎమ్మెల్యేలు ధీమా వ్యక్తం చేశారు. డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో జరిగిన సమీక్షా సమావేశంలో పాల్గొన్న చార్మినార్ నియోజకవర్గం ఇన్‌చార్జి మహ్మద్ ముజీబ్ ఉల్లా షరీఫ్, బహదూర్‌పురా ఇన్‌చార్జి పులిపాటి రాజేష్ కుమార్(రాహుల్) తదితరులతో పాటు మరికొంత మంది పాల్గొనగా.. పాతబస్తీ నియోజకవర్గాలలో కాంగ్రెస్ పార్టీ తరఫున ప్రజాప్రతినిధులు లేకపోవడంతో ఆయా నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేసిన అభ్యర్థులు ఇన్‌చార్జీలుగా వ్యవహరిస్తూ పని చేయాలని సీఎం రేవంత్ రెడ్డి తమకు హామీ ఇచ్చారని మహ్మద్ ముజీబ్ ఉల్లా షరీఫ్, పులిపాటి రాజేష్ కుమార్ తెలిపారు. ప్రజా సమస్యలను పరిష్కరిస్తూనే రాబోయే పార్లమెంట్ ఎన్నికలను పురస్కరించుకుని హైదరాబాద్ పార్లమెంట్ నియోజక వర్గాన్ని కైవసం చేసుకోవడం కోసం కార్యకర్తలు, సీనియర్ నాయకులతో కలిసి పని చేయాలని సీఎం సూచించినట్లు తెలిపారు.

సెంట్రింగ్ యూనియన్ కమిటీకి కమ్యూనిటీ హాల్ నిర్మిస్తాం


కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కౌసర్, బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ జీవన్‌సింగ్, జోగుల రమేష్

జియాగూడ: కార్వాన్ నియోజకవర్గంలో సెంట్రింగ్ యూనియన్ కమిటీ కోసం ప్రభుత్వ స్థలంలో కమ్యూనిటీ హాల్ నిర్మించి ఇస్తామని ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్, బీఆర్ఎస్ కార్వాన్ నియోజకవర్గం ఇన్‌చార్జ్ ఠాకూర్ జీవన్‌సింగ్ అన్నారు. మంగళవారం జియాగూడలో జై దుర్గాభవాని సెంట్రింగ్ అసోసియేషన్ (జియాగూడ కార్వాన్ గుడిమల్కాపూర్‌ల) నూతన సంవత్సర కేలండర్‌ను జోన్ అధ్యక్షుడు జె.కుమార్, ప్రధాన కార్యదర్శి జోగుల రమేష్‌ల ఆధ్వర్యంలో ఏర్పాటైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వారు కేలండర్‌ను ఆవిష్కరించారు. గ్రేటర్ హైదరాబాద్ సెంట్రింగ్ అధ్యక్షుడు కృష్ణ, బాబు, యాదగిరి, చిన్న, హన్మంతు, వినయ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ప్రభుత్వం


మహిళలతో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు కురాకుల కృష్ణ

గోల్కొండ: తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ప్రభుత్వం అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేదల పక్షపాతి అని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కురాకుల కృష్ణ అన్నారు. మంగళవారం ఆయనను బాంజావాడీలో పలువురు మహిళలు కలిశారు. ఇటీవలే ముగిసిన ప్రజా పాలన సభలలో తాము దరఖాస్తులు చేసుకోలేకపోయామని దరఖాస్తు చేసుకోవడానికి తమ వద్ద సరైన ధ్రువపత్రాలు లేవని వారు ఆయనకు తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. ప్రజా పాలన సభలలో దరఖాస్తు చేసుకోలేని వారు నిరుత్సాహ పడొద్దని మళ్లీ 4నెలల తర్వాత ప్రజా పాలన సభలు జరుగుతాయన్నారు. అప్పటి వరకు దరఖాస్తుతో పాటు జత చేయాల్సిన ధ్రువపత్రాలను సిద్ధం చేసుకోవాలని ఆయన సూచించారు.

పార్లమెంటు ఎన్నికల్లో సత్తా చాటుతాం


బండి సంజయ్‌తో దేవర శ్రీనివాస్ తదితరులు

గోల్కొండ: వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ తన సత్తాచాటుందని ఓబీసీ మోర్చా జాతీయ నాయకుడు బండి సంజయ్ అన్నారు. మంగళవారం ఆయనను గుడిమల్కాపూర్‌కు చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు దేవర శ్రీనివాస్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ.. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్‌ల కుతంత్రాలను ఎదుర్కొని ఎనిమిది సీట్లు సాధించామన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నిజస్వరూపం ప్రజలకు తెలిసిందని, పార్లమెంటు ఎన్నికల్లో ఆ పార్టీకి 1–2 సీట్లు మాత్రామే వస్తాయని ఆయన అన్నారు. మోదీ సారథ్యంలో కేంద్రంలో మరోసారి బీజేపీ విజయదుందుభి మోగించడం ఖాయమని ఆయన అన్నారు.

బహుమతుల ప్రదానం


బహుమతులు అందజేస్తున్న సాయిబాబాచారి

గోల్కొండ: గణిత శాస్త్రానికి ఉన్న ప్రాధాన్యం మరే దానికి లేదని గోల్కొండ జగదాంబిక ఆలయ వృత్తి పని సంఘం అధ్యక్షుడు బొమ్మల సాయిబాబాచారి అన్నారు. గోల్కొండ నయీకిలాలోని ఉర్వా హైస్కూల్‌లో వృత్తి పని సంఘం వారి ఆధ్వర్యంలో నిర్వహించిన గణితం క్విజ్ పోటీ విజేతలకు మంగళవారం ఆయన మెమొంటోలు అందజేశారు. గణిత శాస్త్రంలో ప్రావీణ్యం ఉన్న వారికి కార్పొరేట్ రంగంలో ఉజ్వల భవిష్యత్తు ఉందని పాతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ట్రస్ట్ అధ్యక్షుడు శ్రీకాంత్‌చారి అన్నారు. తమ ట్రస్ట్ విద్యార్థులు చదువులో రాణించేలా వివిధ రకాలుగా ప్రోత్సహిస్తున్నామన్నారు. విద్యార్థులతో పాటు గణితం బోధించే యాస్మిన్‌బేగం, సహనీయత్‌ఉన్నీసాలకు ఉత్తమ గణిత టీచర్లుగా ట్రోఫీలు అందించారు. ఉర్వా హైస్కూల్ అకాడమిక్ హెడ్ సమీనాతస్వీర్, ఉపాధ్యాయురాలు అస్మాతబసుం, తరనుంబేగం, షబానా సుల్తానా తదితరులున్నారు.

చెత్త డంపింగ్ సకాలంలో నిర్వహించాలి


ధర్నాకు దిగిన స్వచ్ఛ్ టిప్పర్స్ యూనియన్ సంఘం కార్మికులు


జాతీయ రహదారిపై నివాసాలు, వ్యాపార దుకాణాల వద్ద నిలిచి ఉన్న స్వచ్ఛ్ టిపర్లు

జియాగూడ: జియాగూడ జాతీయ రహదారిలో ఉన్న చెత్త డంపింగ్ యార్డులో సకాలంలో స్వచ్ఛ్ టిప్పర్ల చెత్తను డంప్ చేయకపోవడం వల్ల గంటల తరబడి రోడ్లపై నిలిచి ఉన్న వాహనదారులు, వాపారస్తుల మధ్య తరచు గొడవలు జరుగుతుండడంతో కార్మికులు ఆందోళన చేపట్టారు. మంగళవారం డంపింగ్ యార్డు వద్ద తరచూ మెషిన్లు పని చేయకపోవడంతో రోడ్లపై చెత్త ఆటోలు నిలిచిపోతున్నాయి. ఇతర ప్రాంతాల వారు అక్రమంగా చెత్తను తెచ్చి డంప్ చేయడం వల్ల ఇక్కడి చెత్త ఆటో రిక్షాలు గంటల తరబడి రోడ్లపై నిలిచిపోతున్నాయి. దీంతో మంగళవారం జీహెచ్ఎంసీ స్వచ్ఛ్ టిప్పర్స్ యూనియన్ సంఘం ధర్నా కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షుడు రంగన్న మాట్లాడుతూ..జియాగూడ, కార్వాన్ 12, 13 సర్కిళ్లకు చెందిన సుమారు 300 స్వచ్ఛ్ టిప్పర్లు మాత్రమే జియాగూడ డంపింగ్‌యార్డులో చెత్త పోయాలి. కాగా ఆరెమైసమ్మ, బండ్లగూడ, యూసుఫ్‌గూడ, రాజేంద్రనగర్, అఫ్జల్‌గంజ్, మణికొండ ప్రాంతాలకు చెందిన సుమారు 800 లకు పైగా స్వచ్ఛ్ చెత్త టిప్పర్ల చెత్తను తెచ్చిపోస్తున్నారు. దీంతో జాతీయ రహదారిపై చెత్త వాహనాలు గంటల తరబడి నిలిచిపోతున్నాయి. స్వచ్ఛ్ చెత్తను డంప్ చేయడానికి సుమారు 6 నుంచి 8 గంటల సమయం పడుతుందని దీంతో స్థానికంగా ఉన్న వ్యాపార దుకాణదారులతో తరచు గొడవలు తలెత్తుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం జియాగూడ డంపింగ్‌యార్డుకు 12, 13 సర్కిళ్ల చెత్తను మాత్రమే డంప్ చేసినట్లయితే ఎలాంటి గొడవలు ఉండవని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంటాయని డంపింగ్ యార్డు ఇన్‌ఛార్జ్ మిశ్రా వెంటనే చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో ఆందోళన నిరవధికంగా కొనసాగిస్తామన్నారు.

ముఖ్యమంత్రికి శుభాకాంక్షలు



చాంద్రాయణగుట్ట: ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టి నెల రోజులు పూర్తయిన సందర్భంగా రేవంత్ రెడ్డికి కాంగ్రెస్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర నాయకులు ఆడాల శివకుమార్ శుభాకాంక్షలు తెలియజేశారు. మంగళవారం సీఎం ఛాంబర్‌లో కలిసి పూలబొకే అందజేసి శాలువాతో సన్మానించారు.

దీపదాస్ మున్షిని కలిసిన వెంకటేశ్




గౌలిపురా: కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపదాస్ మున్షిని మంగళవారం గాంధీభవన్‌లో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, చార్మినార్ నియోజకవర్గం మాజీ ఇన్‌చార్జి కె.వెంకటేశ్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి బొకే అందజేసి శాలువాతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. త్వరలో జరగనున్న లోక్‌సభ ఎన్నికలకు హైదరాబాద్‌లో కాంగ్రెస్ పార్టీని విజయం వైపు నడిపించేందుకు కృషి చేయాలని దీపదాస్ మున్షి వెంకటేశ్‌కు సూచించారు.

ఖైదీల విడుదలకు ఎంపీజే కృషి



చార్మినార్: శిక్షా కాలం ముగిసినప్పటికీ.. జరిమానా చెల్లించలేక జైళ్లలోనే మగ్గుతున్న ఖైదీల విడుదల కోసం తమ సంస్థ కృషి చేస్తుందని మూవ్‌మెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్ (ఎంపీజే) రాష్ట్ర కార్యదర్శి సలీముల్ హిందీ తెలిపారు. మంగళవారం ఫైనాన్స్ సెక్రటరీ ఏహెచ్ షకీల్‌తో కలిసి సంగారెడ్డి సెంట్రల్ జైలును సందర్శించి అక్కడి ఖైదీల వివరాలతో పాటు పరిస్థితులను అడిగి తెలుసుకున్నామని.. జైలు సూపరింటెండెంట్‌ను కలిసి నిరుపేదలైన 10 మంది ఖైదీల విడుదలకు అవసరమైన ఆర్థిక సాయం అందజేయడం జరిగిందన్నారు. తాము 2008 నుంచి పేద ఖైదీలకు ఆర్థిక సహాయ సహకారాలు అందజేస్తున్నామన్నామని మంగళవారం పాతబస్తీ పురానీహవేలీలో విలేకరులకు వివరించారు. ఇలాంటి ఆర్థిక సహకారం కావాల్సిన వారు పురానీహవేలీలోని తమ కార్యాలయంలో సంప్రదించాలని ఆయన కోరారు.

కేలండర్, డైరీ ఆవిష్కరణ



అబిడ్స్: ది హైదరాబాద్ జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ నూతన సంవత్సర కేలండర్, డైరీని ఆవిష్కరించారు. మంగళవారం ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కొత్తకురుమ సత్తయ్య, బ్యాంక్ సీఈఓ భాస్కర సుబ్రమణ్యం, బ్యాంకు జీఎం రియాజుద్దీన్, బ్యాంక్ డైరెక్టర్లు ఈ కేలండర్ ఆవిష్కరణ చేపట్టారు. సత్తయ్య మాట్లాడుతూ..బ్యాంక్‌ను మరింత అభివృద్ధి పరిచేందుకు, ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు ప్రత్యేక కృషి చేస్తామన్నారు.

12న మ్యూజియంలో రంగోళి పోటీలు

బహదూర్‌పురా: సాలార్‌జంగ్ మ్యూజియంలో ఈనెల 12న రంగోళి పోటీలను నిర్వహించనున్నట్లు మ్యూజియం అధికారులు తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు రెండు విభాగాల్లో 12–20 ఏళ్లు, 20 ఏళ్లు పైబడిన వారికి ముగ్గుల పోటీలను నిర్వహించనున్నామన్నారు. ఈ పోటీల్లో పాల్గొనే వారు తమ వెంట మెటీరియల్‌ను తెచ్చుకోవాలన్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారికి మొదటి బహుమతిగా రూ.2 వేలు, రెండో బహుమతిగా 1500, మూడో బహుమతిగా రూ.1,000 ఉంటుందన్నారు.

అన్ని ఎంపీ స్థానాల్లో కాంగ్రెస్ విజయం సాధించేలా కృషి చేయాలి


పుష్పగుచ్ఛం అందజేస్తున్న రాష్ట్ర పీసీసీ అధికార ప్రతినిధి గౌరి సతీష్ తదితరులు

అబిడ్స్: రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో 17 ఎంపీ స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించే విధంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రాష్ట్ర పీసీసీ అధికార ప్రతినిధి గౌరి సతీష్ పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమం, ప్రగతి, అభివృద్ధితోనే కాంగ్రెస్ పార్టీ పార్లమెంటు ఎన్నికల్లో విజయ ఢంకా మోగిస్తుందన్నారు. మంగళవారం రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ దీపాదాస్ మున్షికి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అనంతరం గౌరి సతీష్ మాట్లాడుతూ..అన్ని వర్గాల ప్రజలు కాంగ్రెస్‌ను ఆదరిస్తుంటే గత పదేళ్లు 420గా వ్యవహరించిన బీఆర్ఎస్ పార్టీ జీర్ణించుకోలేకపోతుందన్నారు. బీఆర్ఎస్ బీజేపీలకు పార్లమెంటు ఎన్నికల్లో చిత్తుగా ఓడిస్తామని గౌరి సతీష్ పేర్కొన్నారు. అన్నివర్గాల ప్రజలు ఇందిరమ్మ రాజ్యాన్ని ఆదరిస్తున్నారన్నారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన



గన్‌ఫౌండ్రీ: ప్రముఖ నృత్య గురువు దివంగత పద్మభూషణ్ డాక్టర్ వెంపటి చినసత్యం జ్ఞాపకార్థం అభినయవాణి నృత్య నికేతన్ ఆధ్వర్యంలో గత రెండు రోజులుగా రవీంద్రభారతిలో వెంపటి నాట్య మేధా కార్యక్రమం మంగళవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ప్రముఖ నృత్యగురువు కేంద్ర సంగీత నాటక అకాడమీ పురస్కార గ్రహీత ప్రొఫెసర్ రామలింగశాస్త్రీ మాట్లాడుతూ..సంస్కృతి, సాంప్రదాయం, నృత్యం వారసత్వం యొక్క వేడుక అని తెలిపారు. గత రెండు దశాబ్దాలుగా ఎంతో మంది విద్యార్థులకు శిక్షణను ఇస్తూ ఈ వేడుకను కాపాడుతున్న నృత్య గురువు బాలాత్రిపుర సుందరి కృషి అభినందనీయమన్నారు. అంతకు ముందు క్షీరసాగర మదనం అనే నృత్యరూపకాన్ని ప్రదర్శించారు. హెచ్‌సీయూ ప్రొఫెసర్ టి.అనురాధ, మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు కూతురు శారద దేవి, సంస్థ వ్యవస్థాపకురాలు బాలాత్రిపురసుందరి పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి


రిలే నిరాహార దీక్ష చేపడుతున్న రైల్వే కార్మికులు

నాంపల్లి: కొత్త పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ స్కీమ్‌ను పునరుద్ధరించాలని దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ సికింద్రాబాద్ డివిజన్ అధ్యక్షుడు ఎన్.వీ.ఎస్.చౌదరి డిమాండ్ చేశారు. ఎన్ఎఫ్ఐఆర్, జాయింట్ ఫోరం ఆఫ్ రీస్టోరేషన్ ఓపీఎస్ సంస్థల సంయుక్త నిర్వహణలో మంగళవారం పాత పెన్షన్‌ను విధానాన్ని వర్తింపజేయాలని కోరుతూ హైదరాబాద్ రైల్వే స్టేషన్ ప్రాంగణంలో రైల్వే కార్మికులు రిలే నిరాహార దీక్షను చేపట్టారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎన్.వీ.ఎస్.చౌదరి మాట్లాడుతూ..కొత్త పెన్షన్ విధానంతో రైల్వే కార్మికులకు తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. రైల్వే కార్మికులకు నేవీ, ఆర్మీ ఉద్యోగులకు ఇచ్చినట్లుగా పాత పెన్షన్ స్కీమ్‌ను వర్తింపజేయాలని కోరారు. కొత్త పెన్షన్ విధానాన్ని రద్దు చేయకపోతే దేశ వ్యాప్తంగా రైళ్లను స్తంభింపజేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కార్యదర్శి ప్రభురాజ్, ఎస్‌సీఆర్ఈ సంఘ్ అసిస్టెంట్ జనరల్ సెక్రెటరీ, భరణి భాను ప్రసాద్, నేతలు వి.ఎస్.మురళీ, సత్యకుమార్‌రెడ్డి, ఎ.మధుసూదన్, ఈఎస్.శ్రీనివాస్, రాజు, శ్రీజ్యోతి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులు, వితంతువులకు అండగా ఉంటా


వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: వృద్ధులు, వితంతువులకు తాను అండగా ఉంటానని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. మంగళవారం టోలిచౌకీ మెరాజ్ కాలనీలోని తన కార్యాలయంలో ఆయన ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి పలువురు ఆయనను కలిశారు. ఏ ఆసరా లేదని తనను ఆదుకోవాలని ఓ వృద్ధురాలు ఆయనను కలిసి వేడుకుంది. దీనిపై ఆయన ఆమెకు దగ్గరకు తీసుకొని మాట్లాడారు. నీకు నేనున్నానంటూ ఆమెకు భరోసా ఇచ్చి ఆమె సమస్యలను విన్నారు. తనకు ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి ఏమి అందడం లేదని ఈసారైనా తనకు ప్రభుత్వ నుంచి ఆర్థిక సహాయం అందేలా చూడాలని ఆమె కోరింది. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నీకు ప్రతి నెలా ప్రభుత్వం నుంచి పింఛన్ అందేలా చూస్తానన్నారు. ప్రజా పాలన సభలు ముగిశాయని వేలాది మంది పింఛన్‌లు, ఇతర పథకాల కోసం దరఖాస్తు చేసుకున్నారని ఆయన అన్నారు.

మంత్రికి శుభాకాంక్షలు


పొన్నం ప్రభాకర్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తున్న పాతబస్తీ నాయకులు

చార్మినార్: హైదరాబాద్ జిల్లా మంత్రి పొన్నం ప్రభాకర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి బొకే అందజేసి ఘనంగా సత్కారించిన అనంతరం పాతబస్తీ రాజకీయాలను ఆయనతో చర్చించినట్లు చార్మినార్ నియోజకవర్గం ఇన్‌చార్జి మహ్మద్ ముజీబ్ ఉల్లా షరీఫ్, బహదూర్‌పురా ఇన్‌చార్జి పులిపాటి రాజేష్ కుమార్ తెలిపారు. పాతబస్తీలో మెట్రో రైలు పనులను ప్రారంభించడానికి సీఎం రేవంత్‌రెడ్డి చూపిస్తున్న ప్రత్యేక శ్రద్ధ పట్ల పాతబస్తీలోని అన్ని వర్గాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారనే విషయాలను మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు.

దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదును వేగవంతం చేయాలి


ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న రోనాల్డ్ రోస్

నాంపల్లి: ప్రజా పాలన దరఖాస్తుల వివరాల ఆన్‌లైన్ నమోదులో ఎలాంటి తప్పులు దొర్లకుండా చూడాలని జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్ సంబంధిత శాఖ అధికారులకు ఆదేశించారు. మంగళవారం ఖైరతాబాద్ జోన్ పరిధిలోని మెహిదీపట్నం సర్కిల్–12 కేంద్రాన్ని ఆయన సందర్శించారు. అక్కడ డాటా ఎంట్రీ ఆపరేటర్లు చేస్తున్న ప్రజా పాలన దరఖాస్తుల వివరాల ఆన్‌లైన్ నమోదు విధానాన్ని పరిశీలించారు. దరఖాస్తుల నమోదును వేగవంతం చేయాలని కోరారు. ఈనెల 17వ తేదీలోగా పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ వెంకటేష్ ధోత్రే, పలువురు ఏఎంసీలు పాల్గొన్నారు.

అభినందనలు


డాక్టర్ త్రివేణికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న డాక్టర్ సిరాజ్ ఉర్ రెహ్మాన్, వారి కృష్ణారెడ్డి

అబిడ్స్: డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ)గా నియమితులైన డాక్టర్ త్రివేణిని ఉస్మానియా డెంటల్ కాలేజ్ అసోసియేషన్ ఘనంగా సత్కరించింది. అసోసియేషన్ అధ్యక్షుడు ప్రొఫెసర్ డాక్టర్ సిరాజ్ ఉర్ రెహ్మాన్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ వారి కృష్ణారెడ్డి, ఫౌండర్ ప్రెసిడెంట్ డాక్టర్ దయానందం, కోశాధికారి డాక్టర్ రమణ, డాక్టర్ చందులాల్, డాక్టర్ హసన్‌లు ఆమెకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్‌సిరాజ్ ఉర్ రెహ్మాన్ మాట్లాడుతూ..డాక్టర్ త్రివేణి ఆధ్వర్యంలో వైద్య విద్యారంగం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు.

హిందీ భాషీయులకు న్యాయం చేయండి



అబిడ్స్: హిందీ భాషీయులకు పదవుల పంపకంలో న్యాయం చేయాలని రాష్ట్ర పీసీసీ ఓబీసీ సెల్ ప్రధాన కార్యదర్శి నిర్మల్ కుమార్ యాదవ్ పేర్కొన్నారు. గోషామహల్ నియోజకవర్గానికి చెందిన నిర్మల్‌కుమార్ యాదవ్ మంగళవారం రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్ దీపాదాస్ మున్షీని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నిర్మల్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ..36 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతూ.. పార్టీ పటిష్టతకు ఎనలేని కృషి చేశానన్నారు. యాదవ సమాజ్‌కు చెందిన హిందీ భాషీయులమని తెలంగాణ గొర్రె మేకల అభివృద్ధి ఫెడరేషన్ చైర్మన్, డెయిరీ డెవలప్‌మెంట్ ఫెడరేషన్ చైర్మన్ లాంటి పదవులు తమకు ఇచ్చి నాయ్యం చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తా


బాధ్యతలు స్వీకరిస్తున్న మెట్టు రాఘవేంద్ర

అబిడ్స్: ఆలయాల అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తానని టీటీడీ అడ్వైజర్ కమిటీ వైస్ చైర్మన్ మెట్టు రాఘవేంద్ర పేర్కొన్నారు. గోషామహల్ ఆగాపురా నుంచి భారీ ర్యాలీతో ప్రదర్శనగా వెళ్లి టీటీడీ అడ్వైజర్ కమిటీ వైస్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టారు. అనంతరం మెట్టు రాఘవేంద్ర మాట్లాడుతూ..ప్రజల్లో భక్తిభావాలు పెంపొందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. చైర్మన్ రవి ప్రసాద్, ఏఈఓ రమేష్, కోమటిరెడ్డి లక్ష్మి, మెట్టు ప్రసాద్, మెట్టు శ్రీకాంత్, మెట్టు విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

బస్సు బే లలోనే బస్సులను ఆపాలి



చాంద్రాయణగుట్ట: ఆర్టీసీ బస్సులను బస్సు బే లలోనే ఆపాలని చాంద్రాయణగుట్ట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ జె.శ్రీనునాయక్ అన్నారు. చాంద్రాయణగుట్ట ఎంబీఎన్ఆర్ చౌరస్తాలో మంగళవారం ఆయన ప్రత్యేక డ్రైవ్ చేపట్టి ఆర్టీసీ డ్రైవర్లకు పలు సూచనలు నిర్వహించారు. పెద్ద ఎత్తున వాహనాలతో రద్దీగా ఉండే ఎంబీఎన్ఆర్ చౌరస్తాలో వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. ఆర్టీసీ బస్సులను ఎక్కడ పడితే అక్కడ ఆపడంతో సాధారణ వాహనదారులకు ఇబ్బంది కరంగా మారుతుందన్నారు. ఆటోవాలాలు కూడా బస్సు బేలకు దూరంగా ఉండాలన్నారు.

జూలో 500 మొక్కలు నాటిన ఉద్యోగులు



బహదూర్‌పురా: జూపార్కులో పండ్ల మొక్కలను నాటడంతో పక్షులకు పునరావసంతో పాటు ఆహారంగా ఎంతో ఉపయోగపడుతాయని రాష్ట్ర జూపార్కుల డైరెక్టర్ వీఎస్ఎన్‌వీ ప్రసాద్ అన్నారు. సీఎస్ఆర్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం డెల్ టెక్నాలజీస్, లెర్నింగ్ లింక్ ఫౌండేషన్ సంస్థల ఆధ్వర్యంలో జూపార్కును సందర్శించారు. ఈ సందర్భంగా వారు జూపార్కులో రాష్ట్ర జూపార్కుల డైరెక్టర్ వీఎస్ఎన్‌వీ ప్రసాద్, జూపార్కు క్యూరేటర్ సునిల్ ఎస్.హిరేమత్‌లతో కలిసి డెల్ సంస్థ ప్రతినిధులు మణిశ్యామ్, లత తదితరులు దానిమ్మ, జామ, గులాబీ పూల మొక్కలను నాటారు. సామాజిక సేవ కార్యక్రమంలో భాగంగా ఒక మిలియన్ మొక్కలను నాటాలనే లక్ష్యంతో జూపార్కులో 500 మొక్కలు నాటడం అభినందనీయమని రాష్ట్ర జూపార్కుల డైరెక్టర్ వీఎస్ఎన్‌వీ ప్రసాద్ అన్నారు.

పాలపై సీతారాముల చిత్రాలు


పాలపై చిత్రాన్ని వేస్తున్న రామగిరి స్వారిక





గౌలిపురా: ఈనెల 22న అయోధ్యలోని శ్రీరామచంద్రుల మందిరం ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకొని గౌలిపురా అంబికానగర్‌కు చెందిన సూక్ష్మ కళాకారిణి, న్యాయవాది రామగిరి స్వారిక సీతారామచంద్రుల చిత్రాన్ని పాలపై వేసి పలువురిని విశేషంగా ఆకట్టుకున్నారు. అదే విధంగా బాదం గింజపై శ్రీ ఆంజనేయ స్వామి చిత్రాన్ని గీసి రామ్..రామ్ అంటూ రాసింది. రామగిరి స్వారిక ఇప్పటికే పలువురు రాజకీయ నాయకులు, దేవతామూర్తులు ఇతర చిత్రాలను అద్భుతంగా వేసి పలు అవార్డులు, ప్రశంసా పత్రాలను అందుకున్నారు.